క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కారానికి గ్రీవెన్స్



బుచ్చెయ్యపేటలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట: గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. సచివాలయాల్లో వచ్చిన ప్రతి అర్జీకి సిబ్బంది పరిష్కారం చూపాలన్నారు. ప్రతి బుధవారం రావికమతం, రోలుగుంట, గురువారం బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ డి. నాగేశ్వరిదేవి, ఏతం రాజు, జేతం ప్రభ, ఏపీవో వరహాలబాబు పాల్గొన్నారు.

50 స్టీల్ కంచాల వితరణ



అన్నదాన కార్యక్రమానికి కంచాలు వితరణ చేస్తున్న దాతలు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ షిర్డీ సాయి బాబా మందిరంలో ప్రతీ గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కురుమూజు ఈశ్వర రావు, ప్రభ దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముషిడిపల్లి గ్రామానికి చెందిన సిరపరపు పైడంనాయుడు దంపతులతో పాటు వారి అల్లుడు, కుమార్తె పైల శ్రీను, బాంధవి దంపతులు 50 స్టీల్ కంచాలను వితరణగా అందజేశారు. తందారపు అప్పారావు 25 కేజీల వంట పాత్రను అందజేశారు. వీరితో పాటు పలువురు దాతలు వస్తు, ధన రూపేణా విరాళాలు అందజేశారు.

7న మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట: ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాస రావు అధ్యక్షతన ఈ నెల 7న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండల అభివృద్ధిపైన అన్ని శాఖల అధికారులతో సమీక్ష, ఎంపీపీ ఆదేశాలతో పలు సమస్యలు చర్చిస్తామన్నారు. సమావేశానికి పూర్తిస్థాయి సమాచారంతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

యండపల్లిపాలెంలో సప్తాహం



యండపల్లిపాలెంలో హరేరామ హరేకృష్ణ నామసంకీర్తన చేస్తున్న భక్తజనం

దేవరాపల్లి: మండలంలోని కె.ఎం.పాలెం పంచాయతీ శివారు యండపల్లిపాలెంలో భక్తి శ్రద్ధలతో సప్తాహం నిర్వహిస్తున్నారు. స్థానిక రామాలయంలో తొమ్మిది రోజుల పాటు పగలు 24 గంటలు ఏకధాటిగా హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన కొనసాగుతోంది. దేవానంద స్వామిజీ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉగాది రోజు ప్రారంభమైన నామ సంకీర్తన శ్రీరామనవమితో ముగుస్తుందని స్థానిక భక్తులు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, యువకులు సైతం ఉత్సాహంగా పాల్గొని హరే రామ హరే కృష్ణ నామ స్మరణం చేస్తూ తరిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

పాఠశాలల్లో శక్తి వారియర్ గ్రూపులపై అవగాహన



బాలికలకు శక్తి వారియర్ గ్రూపులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రఘువర్మ

రావికమతం: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాఠశాలల్లో బాలికలకు శక్తి వారియర్ గ్రూపులపై రావికమతం ఎస్‌ఐ రఘువర్మ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతిలో ఐదుగురు తెలివైన బాలికలతో శక్తి వారియర్ గ్రూపును ఏర్పాటు చేస్తామన్నారు. వారిలో ఒక్కరు లీడర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. లీడర్లు అంతా శక్తి కోర్ కమిటీగా ఏర్పడతారని, ఈ కమిటీకి ఓ ఉపాధ్యాయుడు మార్గదర్శనం చేస్తారని చెప్పారు. శక్తి వారియర్ గ్రూప్‌లు మిగతా విద్యార్థులకు బ్యాడ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తాండవలో చేపల వేట

- జలాశయంలో తగ్గిన నీరు
- ప్రస్తుతం ముమ్మరంగా బొచ్చుల వేట
- మరో వారం రోజుల్లో రొయ్యల వేట ప్రారంభం



జాలర్లుకు దొరుకుతున్న బొచ్చు చేపలు



తాండవ జలాశయంలో చేపల వేట నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: తాండవ జలాశయంలో చేపల వేట ముమ్మరంగా సాగుతోంది. వేసవి ప్రారంభం కావడం జలాశయంలో నీరు తగ్గిపోవడంతో జాలర్లకు చేపల వేటకు దిగారు. తాండవ జలాశయం పరిధిలో 400 మంది వరకు జాలర్లు ఈ వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం జాలర్లకు బొచ్చులు దొరుకుతున్నాయి. రోజూ సాయంత్రం వలలు వేసిన అనంతరం మరుసటిరోజు తెల్లవారు వెళ్లి వలలు తీస్తున్నారు. ఆ సమయంలో గడ్డి చేప, బంగారుపాప, బొమ్రుబొచ్చులు దొరుకుతున్నాయి. వాటిని మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు.

నీటి నిల్వలు తగ్గిపోవడంతోనే..

20 రోజులు నుంచి ఎండలు తీవ్రత అధికంగా ఉంది. దీనికి తోడు తాండవ జలాశయానికి ఆధారమైన బొడ్డేరు, దారగెడ్డల నుంచి నీరు ప్రవహించలేదు. దీంతో తాండవ జలాశయంలో నీరు రోజు రోజుకి తగ్గిపోతోంది. నీరు తగ్గడంతో వేటకు చేపలు చిక్కుతున్నాయి. తాండవ జలాశయంలో వెంకటాపురం, పొగచెట్లపాలెం, అమ్మపేట, గొలుగొండ, సాలికమల్లవరం, జాలారుపేట తదితర్లు గ్రామాలకు చెందిన 400 మంది స్వదేశీ జాలర్లు వేట సాగిస్తున్నారు. రోజూ ఒక్కొక్క జాలరుకు రూ.500 వరకు ఆదాయం సమకూరుతోంది.

రొయ్యల వేటకు సన్నద్ధం

జలాశయంలో ఏటా ఏప్రిల్‌లో రొయ్యల వేట ప్రారంభమై, మరలా జూలై చివరి వరకు సాగిస్తుంటారు. చేపల వేట కంటే రొయ్యల వేటలో అధికంగా ఆదాయం వస్తోంది. ఈ పంట మూడు నెలల పాటు జరుగుతుందని, అప్పట్లో అయితే వెయ్యి రూపాయిల వరకు ఆదాయం వస్తుందని జాలర్లు చెబుతున్నారు.

> **రొయ్యల వేటతో ఆదాయం**
>
> ఏటా రొయ్యల వేట ప్రారంభం నుంచి జాలర్లకు పంట పండుతుంది. ఈ వారంలో వేట ప్రారంభం చేయడం కోసం మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మూడు నెలల పాటు జాలర్లు రోజూ రొయ్యల వేట సాగిస్తారు.
>
> – సత్తిబాబు, జాలరు, వెంకటాపురం

ఉపాధి పనులతో గ్రామాల్లో అభివృద్ధి



పింద్రంగిలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రామలక్ష్మి, ఎంపీటీసీ గోపి



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ నూకాలమ్మ, తాండవ చైర్మన్ సత్యనారాయణ



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

కె.కోటపాడు: ఉపాధి నిధులతో వేతనదారులకు స్థానికంగానే పని కల్పించడంతోపాటు గ్రామాభివృద్ధి చెందుతుందని సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పింద్రంగిలోని రాజి చెరువులో పూడికతీత పనులతో పాటు గట్టు పటిష్టత చేపట్టేందుకు రూ.9 లక్షల ఉపాధి నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం సర్పంచ్, ఎంపీటీసీ ప్రారంభించారు. చెరువులో పూడికతీత పనుల ద్వారా నిల్వనీటి సామర్థ్యం పెరిగి పొలాలకు మరింతగా సాగునీరు అందుతుందన్నారు. ఉపాధి పనులకు 105 మంది వేతనదారులు హాజరయినట్లు వీఆర్పీ కృష్ణవేణి తెలిపారు. నాయకులు లెక్కల చందర్రావు, గొలగాన రమణ, సింగంపల్లి భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి పనులకు భూమి పూజ

నాతవరం: ప్రజలకు అవసరమైన ఉపాధి హామీ పనులు చేపట్టాలని సర్పంచ్ అంకంరెడ్డి నూకాలమ్మ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. గురువారం చినగొలుగొండపేట, ఎం.బి.పట్నం గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాలకు ఉపయోగపడే పనులు చేస్తే అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కూలీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కూలీలు చేసిన పనిలో ఎలాంటి అవకతవకలు లేకుండా బాధ్యతగా కొలతలు సేకరించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్పీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలో ఎ.అగ్రహారంలో కామరాజు చెరువులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ సలాది ధనలక్ష్మి గంగేశు గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కూలీలకు పనులు గిట్టుబాటు అయ్యేలా వేతనాలు వెనువెంటనే చెల్లింపులు చేయాలన్నారు. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని కోరారు.

భూసార పరీక్ష ఆధారంగానే ఎరువులు



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అప్పారావు



మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు

నర్సీపట్నం: భూసార పరీక్షలు ఆధారంగానే ఎరువులు వినియోగించాలని వ్యవసాయ శాఖ ఏవో అప్పారావు రైతులకు సూచించారు. నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవాలన్నారు. నేలలో ఉన్న భూసారాన్ని బట్టి ఎరువుల వాడకం చేయాలన్నారు. పొలంలోని మట్టి నమూనాలను సేకరించి వ్యవసాయశాఖ సిబ్బందికి అందజేయాలన్నారు. రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సిహెచ్.చిరంజీవి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జులు, రైతులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. గురువారం సాగరం, వీరనారాయణం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వచ్చే తొలకరిలో పంటలు వెయ్యబోయే రైతులు తప్పనిసరిగా మట్టి నమూనాలు సేకరించి, సమీపంలో రైతు సేవా కేంద్రాలు సిబ్బంది ద్వారా అనకాపల్లిలో మట్టి నమూనా పరీక్షల ప్రయోగశాలకు పంపించాలన్నారు. అక్కడ ఇచ్చిన ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడకం చేపట్టాలని సూచించారు. ప్రయోగశాల వారు ఇచ్చే సాయిల్ హెల్త్ కార్డులో ప్రధాన మూలకాలు నత్రజని, భాస్వరం, పోటాష్, జింక్, ఐరన్, బోరన్ వంటి సూక్ష్మ పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో, ఎంత మోతాదులో వెయ్యాలో తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ, సన్యాసినాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు ప్రధాన రహదారిలో సందాక తాతారావు ఇంటి ముందు మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. బుధవారం సాయంత్రం నుంచి పని చేయకపోవడం వల్ల తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ సంజీవిరావు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా, గురువారం ఉదయం యుద్ధప్రాతిపదికన బోరుకు మరమ్మతులు చేపట్టారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, వార్డు సభ్యులు ఎం. సత్తిబాబు, కాళింగ గోపాల్ పాల్గొన్నారు.

పాడి రైతులతో సహకార సంఘాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడి నరేష్

మాకవరపాలెం: పాడి రైతులతో సంఘ మిత్ర పశు గ్రాస, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలు ఏర్పాటు చేయనున్నట్టు పశు సంవర్ధక శాఖ కోటవురట్ల ఇన్‌చార్జ్ ఏడీ పి.నరేష్ తెలిపారు. పాడి రైతులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘంలో షేర్ హోల్డర్‌గా చేరాలంటే రైతులు రూ.500 చొప్పున చెల్లించాలన్నారు. రూ.500 నుంచి రూ.2 వేలు వరకు షేర్ ధనం చెల్లించవచ్చన్నారు. 300 నుంచి 750 మంది వరకు షేర్ హోల్డర్స్‌గా ఉండొచ్చన్నారు. పశువులకు సోకే సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలను దూరంగా వెయ్యండి

మాడుగుల రూరల్: మాంసం దుకాణాల్లో వ్యర్థాలను గ్రామానికి దూరంగా గొయ్యి తీసి పూడ్చాలని ఎంపీడీవో కె. అప్పారావు పంచాయతీ కార్యదర్శి బి. నవీన్‌దొర, పంచాయతీ జూనియర్ సహాయకుడు సత్యనారాయణకు సూచించారు. కె.జె.పురం మెయిన్ రోడ్డుపై కోళ్ల మాంసం దుకాణం వద్ద వ్యర్థాలు వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు మేరకు ఆయన గ్రామాన్ని సందర్శించారు. చికెన్‌సెంటర్ నిర్వాహకులుతో మాట్లాడారు. వ్యర్థాలను మురుగు కాలువల్లో వెయ్యవద్దని చికెన్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు.

బుచ్చింపేట పీహెచ్‌సీలో వసతులపై కేంద్ర బృందం ఆరా



సిబ్బంది విధుల గురించి తెలుసుకుంటున్న కేంద్ర వైద్య ప్రతినిధి

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్య బృందం సభ్యులు గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. సిబ్బంది, మందుల కొరత, వసతులు, తదితర అంశాలపై వైద్యులు సునీత, శ్రీనివాసురాజుతో చర్చించారు. దీనిలో భాగంగా ఏఎన్ఎంలను రోగులకు అందిస్తున్న సేవలు, ప్రసవాల వివరాలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిస్ట్ కొండబాబును మందుల కొరతపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమస్యలు, వైద్య సేవలు, సిబ్బంది తీరు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు వాసంత రెడ్డి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

నదుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా

- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ముద్దుర్తి వద్ద శారదానది ఒడ్డున ఇసుకను లారీపై లోడ్ చేస్తున్న దృశ్యం

చోడవరం: చోడవరం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ ప్రాంతంలో నదులు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం అధికారిక ఇసుక రీచ్‌లు ఏమీ లేవు. శారద, పెద్దేరు, బొడ్డేరు, సర్పా నదులు చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల మీదుగా కిందకు దిగువకు ప్రవహిస్తున్నాయి. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో గ్రామాలన్నింటిల్లోనూ ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. నాలుగు మండలాల్లో 20 వరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరిగే ప్రదేశాలు ఉన్నాయి. ఎక్కువగా చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో ఇసుక తవ్వకాలు, రవాణా ఎక్కువగా జరుగుతోంది. భోగాపురం, ముద్దుర్తి, గోవాడ, గవరవరం, రాయపురాజుపేట, గౌరీపట్నం, జుత్తాడ, గజపతినగరం, పీఎస్‌పేట, నర్సయ్యపేట, అంబేరుపురం, లక్ష్మీపురం కల్లాలు, విజయరామరాజుపేట, వడ్డాది, కుముందానిపేటతోపాటు రావికమతం, రోలుగుంట మండలాల్లో పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతోంది. నదుల్లోంచి ఎడ్లబళ్లతో ఇసుకను ఒడ్డుకు తరలించి, అక్కడ నుంచి లారీలు, ట్రాక్టర్లతో బయలు తరలిస్తారు. రోజూ 50–70 లారీలు, 100 ట్రాక్టర్ల ఇసుక ఈ అక్రమ రీచ్‌ల నుంచి మండలంతోపాటు విశాఖపట్నం, పరవాడ, సబ్బవరం, పెందుర్తి ప్రాంతాలకు అక్రమ రవాణా సాగుతోంది. నదల్లోంచి ఎడ్లబళ్ల సాయంతో ఇసుకకు బయటకు తెచ్చి నదీ పరివాహక ప్రాంతాల్లో స్టాక్ చేస్తున్నారు. ఆ ఇసుకను ఎడ్లబళ్లదారుల నుంచి ఇసుకను కొనుగోలు చేసుకొని లారీలు, ట్రాక్టర్లపై బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..

ప్రతి నెలా రూ.10 లక్షలకు పైబడే ఈ ప్రాంతం నుంచి ఇసుక అక్రమ వ్యాపారం సాగుతోంది. టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసూలు చేసి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. అడపాదడపా పత్రికల్లో వార్తలు వస్తే రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు మొక్కుబడిగా దాడులు చేసి ఒకట్రెండు బళ్లు పట్టుకోవడం మినహా ఇసుక వ్యాపారం మాత్రం అధికారపార్టీ నేతల కనుసన్నల్లో హాయిగా జరుగుతోంది. ఒక వేళ ఏ బండినైనా పట్టుకుంటే అక్కడ టీడీపీ నాయకుడు అధికార పార్టీ పెద్ద నాయకులతో అధికారులపై ఒత్తిడి తేవడంతో చాలా సార్లు లారీలు, ఎడ్లబళ్లు, ట్రాక్టర్లను వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ రీచ్‌లున్న ప్రదేశాల్లోనే పలుమార్లు పర్యటించినా వాటిని అదుపు చేయలేదు.

నిఘా ప్రాంతాల్లో డ్రోన్‌తో పర్యవేక్షణ



డీఎస్పీ సమక్షంలో డ్రోన్ కెమెరాను ఆపరేట్ చేస్తున్న పోలీసు సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న ప్రాంతాల్లో రోజూ డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం డీఎస్పీ సమక్షంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు, సిబ్బంది డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శివపురం, గుర్రాల రోడ్డు, ఇందిరా మార్కెట్, బలిఘట్టం శివాలయం, డిగ్రీ కాలేజీ, పెదబొడ్డేపల్లి చెరువు ప్రాంతాల్లో డ్రోన్ నిఘా పెట్టామన్నారు. బహిరంగంగా మద్యం సేవించినా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా పోలీసులకు దొరుకుపోతారన్నారు. డ్రోన్ ద్వారా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించారు.

తాండవ ఆయకట్టుకు నీటి తీరువా వసూలు

తహసీల్దారు వేణుగోపాల్



నాతవరం: తాండవ ఆయకట్టు భూములకు నీటి తీరువా కోటి రూపాయల బకాయి ఉందని తహసీల్దారు ఏ వేణుగోపాల్ గురువారం తెలిపారు. వేలాది ఎకరాలు భూములకు 20 ఏళ్లగా రైతుల నుంచి పన్నులు వసూలు చేయలేదన్నారు. ఎకరా భూమికి రూ.200 చొప్పున అసలు వడ్డీతో కలిపి నీటి తీరువా వసూలు చేయాలన్నారు. సకాలంలో చెల్లించని రైతులు నుంచి అసలుకు 6 శాతం వడ్డీ కలిపి వసూలు చేయాలని వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన



ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

నర్సీపట్నం: సంప్రదాయ జీలుగు కల్లు దొరికిందని గిరిజనులపై కేసులు పెట్టడం సరికాదని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు పేర్కొన్నారు. కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం ఆదివాసీలు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. కొర్రా కొండబాబు, వంతల సురేష్, మర్రి రాజుబాబుపై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఆదివాసీలు మైదాన ప్రాంతాల్లో తాటి, జీలుగు చెట్ల నుంచి కల్లు తీస్తాయన్నారు. సంప్రదాయ పానీయమే తప్ప కంపెనీల్లోనూ, కృత్రిమంగా తయారు చేసిన సారా, బ్రాందీ వంటివి కావన్నారు. వీటిపై ఆధారపడి వేలాది వెనుకబడిన కులాలు జీవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఆదివాసీలకు జీలుగు కల్లు మినహాయింపు ఇచ్చిన విషయం మరిచి ఎక్సైజ్ పోలీసులు కేసులు పెడుతున్నారన్నారు. కేసులు పెట్టడాన్ని ఎక్సైజ్ పోలీసులు విరమించుకోవాలన్నారు.

చిన జగ్గంపేటలో రామాలయం ప్రారంభం



గ్రామంలో వేదపండితులతో హోమాలు



విగ్రహ ప్రతిష్టకు హాజరైన గ్రామస్తులు

నాతవరం: స్థానిక పంచాయతీ శివారు చిన జగ్గంపేట గ్రామంలో సీతారాముల ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు దివంగత నేత అంకంరెడ్డి జమీలు ఆశయ సాధన మేరకు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక దంపతుల ఆధ్వర్యంలో జమీలు భార్య డీసీసీబీ మాజీ డైరెక్టరు అంకంరెడ్డి పార్వతి, తదితరులు విగ్రహాలు ఏర్పాటు, ఆలయ ప్రారంభోత్సవం చేశారు. చిన జగ్గంపేట గ్రామపెద్దలు, వేదపండితులతో ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జమీలు ఇచ్చిన మాట అసంపూర్తి నిర్మాణంలో ఉన్న సీతారాముల ఆలయ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జమీలు సైన్యం, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్ పాల్గొన్నారు.

పంచాయతీల విద్యుత్ బిల్లులు తక్షణమే చెల్లించాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న వడ్డాది సబ్ డివిజన్ ఏడీ సురేష్ కుమార్

రావికమతం: మండలంలోని పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు తక్షణమే చెల్లించాలని వడ్డాది సబ్ డివిజన్ ఏడీ సురేష్ కుమార్ పంచాయతీ కార్యదర్శులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకన్నబాబు ఆధ్వర్యంలో 28 పంచాయతీల కార్యదర్శులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 పంచాయతీలు రూ.1.86 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయన్నారు. బిల్లుల చెల్లింపునకు కొంత సమయం కావాలని కార్యదర్శులు కోరగా, వీలైనంత త్వరగా చెల్లించాలని ఏడీ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో హేమసుందరరావు



కార్యదర్శులు, విద్యుత్, ఉపాధి అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ శాఖ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కె. అప్పారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం గ్రామీణ తాగునీరు విభాగం, ఏపీఈపీడీసీఎల్, ఉపాధి హామీ పథకం ఏపీవోతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీరు సమస్య తలెత్తకుండా సమన్వయంతో అధికారులు పని చేయాలన్నారు. సమావేశంలో మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగమల్లేశ్వరి, ఏపీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

చీడికాడ: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసే బాధ్యత గ్రామ, మండల స్థాయి అధికారులపై ఉందని ఎంపీడీవో హేమసుందరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన తరుణంలో గ్రామాల్లో పాడైన బోర్లు, వాటర్ ట్యాంకుల నిర్వహణను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంతే కాకుండా ఉపాధి కూలీలు సకాలంలో వచ్చి 11 గంటలకు పని ముగించుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. ఎవరూ వడదెబ్బకు గురి కాకుండా చూడాలన్నారు. అంతా రూ.307 వేతనం పొందేలా పనిలో పాల్గొనాలన్నారు.

దొండపూడిలో చలివేంద్రం

రావికమతం: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం దొండపూడిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వివిధ పనులుపై సచివాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ సెక్రటరీ పోలిరెడ్డి తెలిపారు.